క్లుప్తంగా

34 రోజుకు దీక్షలు


దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేపట్టిన రిలే నిరహార దీక్షలు 34వ రోజుకు చేరుకున్నాయి. రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ ఆధ్వర్యంలో చిల్వెర ఐబీ చౌరస్తాలో దీక్షలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ప్రకటించే వరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు బ్రహ్మం, సాయిలు, బేతయ్య, రాములు గురువారం తెలిపారు.

జియో సిగ్నల్స్ జామ్

నిజాంపేట(మెదక్): నిజాంపేటలో రెండు రోజుల నుంచి జియో స్గిగల్స్ జామ్ అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో గురువారం కూడా స్థానికులు చాలా ఇబ్బందిపడ్డారు. చాలా మంది ఫోన్లు మాట్లాడాల్సి వస్తే రోడ్లపైకి, సిగ్నల్ వచ్చే ప్రాంతాలకు పరుగులు తీశారు. ఆరోగ్య శ్రీ కార్డు రిజిస్ట్రేషన్, ఆధార్ నమోదు, ఈ సేవ వంటి పనులు ఆగిపోయాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లాప్‌టాప్‌లు పట్టుకుని పొలాలవైపునకు వెళ్లాల్సివచ్చింది. జియో యాజమాన్యానికి టవర్ ఏర్పాటైన స్థల యజమానికి మధ్య జరిగిన ఒప్పందంలో తేడాలే ఈ సమస్యకు కారణంగా తెలిసింది. జియో యాజమాన్యం సమస్యను త్వరగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

అల్లాదుర్గం(మెదక్): మందాపూర్ గ్రామంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. గణేశ్ యూత్ అసోషియన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు ఉత్సాహంతో రక్తదానం చేశారు. తామిచ్చే రక్తం మరోకరి ప్రాణం కాపాడుతుందని, అందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. గణేశ్ యూత్ సభ్యులు అజయ్‌గౌడ్, ప్రమోద్‌రెడ్డి, రవికిరణ్, అనిల్, కృష్ణ, రజనీకాంత్, విఠల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికల జోరు


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

రేగోడ్(మెదక్): మండలంలోని పలు గ్రామాలు, తండాల బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి జోరుగా చేరుతున్నారు. పెద్దతండా, సంగమేశ్వర తండా, తాటిపల్లి నుంచి సుమారు అరవై కుటుంబాలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావ్ గురువారం తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ వారందరికీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారని చెప్పారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, పెద్ద తండా ఉప సర్పంచ్ సంగ్యానాయక్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

నర్సాపూర్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆదేశించారు. ఈకేవైసీ నమోదు సెంటరును గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలించి సెంటరులో ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సదుపాయం ఉన్న వారికి ప్రభుత్వం రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలకు సదుపాయాన్ని పెంచిందని ఆమె వివరిస్తూ ఆరోగ్యశ్రీ సదుపాయం ఉన్న వారందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గొట్టిముక్కులలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయశ్రీ, రైతుబంధు అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ఎంపీటీసీ దత్తు, వీణసుభాష్‌గౌడ్, నాయకులు సూర్యప్రకాష్, గంగారాం, సంగయ్య తదితరులున్నారు.


పెద్దశంకరంపేటలో వినాయక నిమజ్జనం


వేలం పాటలో లడ్డు దక్కించున్న గోపి

వైభవంగా వినాయక శోభాయాత్ర

గణేశ్ నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్ని మండలాల్లోనూ వినాయక శోభాయాత్రలు వైభవంగా నిర్వహించారు. బుధ, గురువారాల్లో భక్తులు వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో వినాయకుడి విగ్రహాలను ఉంచి ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. యువకులు నృత్యాలు, కేరింతలతో ఊరేగింపు తీసుకెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. వివిధ మండపాల్లో అన్నదానాలు నిర్వహించారు. నర్సాపూర్ రూరల్ ఆవంచ గ్రామానికి చెందిన కరీం కుల మతాలకు అతీతంగా అన్నదానానికి బియ్యం అందజేసి తన భక్తిని చాటుకున్నాడు. అలాగే చిన్నగొట్టిముక్లలో లడ్డు వేలం పాట నిర్వహించగా బీజేపీ నాయకుడు సింగాయిపల్లి గోపి రూ.2.65 లక్షలకు దక్కించుకున్నారు.


నిజాంపేటలో..


ఎనగండ్లలో..


అన్నదానానికి బియ్యం అందజేస్తున్న కరీం


కాడిపల్లిలో..


దౌలాపూర్‌లో..

దేశం కోసం భగత్‌సింగ్ ప్రాణత్యాగం

- ఘనంగా భగత్‌సింగ్ జయంతి

నిజాంపేట(మెదక్): దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలను ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూతన బస్టాండ్ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్, నిజాంపేట మండల నాయకులు వేణు, అజయ్, కుమార్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ..

తూప్రాన్: పట్టణంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సతీష్‌చారి, కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ దేశం కోసం భగత్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపర్‌డెంట్ అమర్‌సింగ్‌తో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పసుల నారాయణ, ఉపేందర్, మన్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.


కాడిపల్లి బీసీహాస్టల్‌లో నివాళి అర్పిస్తున్న చిన్నారులు

బీసీ హాస్టల్‌లో ...

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక బీసీ హాస్టల్‌లో గురువారం ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి విద్యార్థులతో కలిసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర కోసం పోరాడిన మహాయోధుడు భగత్ సింగ్ అని చెప్పారు. కార్యక్రమంలో వార్డెన్ ప్రణయ్‌కుమార్, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిని పర్మనెంటు చేయాలి


సమ్మె శిబిరంలోమాట్లాడుతున్న మల్లేశం

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మనెంటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 18వ రోజుకు చేరింది. ఆయన సమ్మె శిబిరంలో పాల్గొని సమ్మె చేస్తున్న వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లతో అనేక పనులు చేయిస్తుందని, వారికి కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో పాటు ఉద్యోగ భద్రత లేదని ఆయన ఆరోపించారు. వారికి ఉద్యోగు భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండు చేశారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

- రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకువిద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు స్థానిక సరస్వతి కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ -14 బాలికల విభాగంలో పాఠశాల విద్యార్థులు చెరిష్మిక, సోనా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ సుమిత్ర ప్రభాకర్ తెలిపారు. ఆ విద్యార్థులను గురువారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో పాటు పాఠశాల డైరెక్టర్లు కర్నెదత్, శ్రీవిద్య, స్కూల్స్ టీచర్లు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి మెదక్ జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీకుమార్, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయం మేరకే టికెట్ ఇవ్వాలి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ కోసం శక్తి వంచనలేకుండ కష్టపడ్డ కార్యకర్తల అభిప్రాయం మేరకే మెదక్ శాసనసభ టికెట్టు ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. అనంతరం వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడారు.గతంలో ఇలాచేయడం వల్లే ఘోరంగా దెబ్బతిన్నారని గుర్తుచేశారు. మాజీ సర్పంచ్ గడ్డం నేల్లూర్, కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, నర్సాగౌడ్, నవీన్ తదితరులు ఉన్నారు.

అందరూ ఐక్యంగా ఉండాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. గురువారం మిలాద్ ఉన్‌నభి సందర్భంగా మండల కో ఆప్షన్ సభ్యులు యాదుల్ హుస్సేన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. వైస్‌ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ దత్తు, వీణసుభాష్‌గౌడ్, దామోదర్, సర్పంచ్‌లు నరేష్, సుభాష్, నాయకులు అడివయ్య, కిషన్ సేట్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం

- అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్
- చల్లపల్లిలో అబివృద్ధి పనులకు భూమిపూజ

టేక్మాల్(మెదక్): గ్రామాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని చల్లపల్లి గ్రామరోడ్డు పనులను మెదక్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చల్లపల్లి గ్రామాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ దత్తత తీసుకోవడం సంతోషకరమన్నారు. దత్తత తీసుకున్న గ్రామాన్ని మొదటి సారిగా సందర్శించి రూ.15లక్షలు మంజూరు చేయడం అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రజలందరూ భాగ్యస్వాములు కావాలని సూచించారు. ఎలకుర్తి గ్రామ ఎల్లమ్మ ఆలయనికి బోరు మోటార్ మంజూరు చేసినందుకు ఆమెను గౌడ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతస్వప్న రవి, సర్పంచ్ గోపాల్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షురాలు శ్వేతాచంద్రశేఖర్‌రెడ్డి, సీపీసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజయ్య, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, మాజీ ఎంపీటీసీ సిద్ధన్న పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం


కౌడిపల్లిలో నినాదాలు చేస్తున్న ఆశావర్కర్లు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో గురువారం ఆశా వర్కర్లు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, ప్రమాదబీమ రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. లెప్రసీ సర్వేను ఆశాలతో కాకుండా వాలంటీర్లతో చేయించాలని, బకాయిపడ్డ కరోనా అలవెన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం మండలం అధ్యక్షురాలు చెన్నమ్మ, వసంత, శ్యామల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వులతో..

చిన్నశంకరంపేట(మెదక్): ఆశ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ చిన్నశంకరంపేటలో దీక్షలు చేస్తున్న ఆశా వర్కర్లు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. గురువారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దీక్షలో పాల్గొన్న ఆశా వర్కర్లకు సీఐటీయూ జిల్లా నాయకులు నందన్, సంతోషి సంఘీభావం తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామంలో వేర్వేరు సంఘటనల్లో మృతి చెందిన ఇద్దరి కుటుంబ సభ్యులను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు బీసు రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అమ్మన్నగారి లింగమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబాలను కలిసిన ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సిద్దరాంలు, మాజీ సర్పంచ్ పిట్ల శ్యాం, నాయకులు భూలింగం ఉన్నారు.


రవి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే

ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం


బాధితులకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ

- జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు తాను అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా చెప్పారు. మండల పరిధిలోని పిల్లుట్లకు చెందిన కమ్మరి భాస్కర్, నెల్లూరమ్మ, విద్యార్థి సాయికిరణ్ అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ఆయన ఆయా బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పత్రాల శ్రీనివాస్‌గౌడ్, గౌనిబైటి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనంత కరుణామయుడు అల్లా

- భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్‌నబీ వేడుకలు

నిజాంపేట(మెదక్): అనంత కరుణామయుడైన మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని ముస్లింలు భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్‌నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ముస్లింలు గురువారం జెండా ఆవిష్కరించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు మైనోద్దీన్, ఇక్బాల్, నాయబ్, ఇమామ్ తల్హా తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు..

మనోహరాబాద్(తూప్రాన్): మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా ముస్లింలు మనోహరాబాద్, కాళ్ళకల్, ముప్పిరెడ్డిపల్లి, లింగారెడ్డి పేట్ గ్రామాలలో మసీద్‌లను అందంగా అలంకరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రవక్త నామస్మరణలతో గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్‌లో తూప్రాన్ పీఏసీఎస్ డైరక్టర్ జావీద్ పాషా, షర్ఫోద్దీన్, తౌఫీక్, మునావర్, సమద్, లాయిక్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.


మనోహరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సంక్షిప్త వార్తలు

◆ స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు డిమాండ్ చేశారు. గురువారం చిన్నశంకరంపేట బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డితో కలిసి మాట్లాడుతూ మండలంలో పరిశ్రమలు ఉన్నా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు వనం నర్సింహులు, మండల ప్రధాన కార్యదర్శి దశరథం తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

మెదక్ మున్సిపాలిటీ: గ్రామాల అభివృద్ధి ఆకాంక్షించి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారు. రాజపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సమక్షంలో 20 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యేసయ్య, సంఘ బాధ్యులు నాగరాజుతో పాటు సుమారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ లావణ్య రెడ్డి, వైస్ ఎంపీపీ ఆంజనేయులు పాల్గొన్నారు.

◆ ఫోన్ రికవరీ

చేగుంట(తూప్రాన్): పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి బాధితుడికి అందజేసినట్టు ఎస్ఐ హరీష్ తెలిపారు. నిజాంపేట గ్రామానికి చెందిన విశ్వేశ్వర శర్మ తన ఫోన్‌ను పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఉన్న స్థలాన్ని గుర్తించి ఫోన్‌ను రికవరీ చేశారు.

◆ 'హలోమాదిగ..'విజయవంతం చేయాలి

చేగుంట(తూప్రాన్): 'హలో మాదిగ చలో భూంపల్లి'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ రాజకీయ చైతన్యవేదిక దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 30న భూంపల్లి గ్రామంలో మాదిగ రాజకీయ చైతన్యవేదిక సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి చేగుంట, నార్సింగి మండలాల దళితులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కోకన్వీనర్ శివరాజ్, ఎర్రయాదగిరి, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

◆ స్వశక్తి కరణ్ అభియాన్

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈర్ల రంజిత్‌రెడ్డి బీజేపీ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ స్థాయిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకుడు శ్రీపాల్, నాయకులు బిక్షపతి, శంకర్, మండల ఉపాధ్యక్షుడు పోచయ్య, బూత్‌అధ్యక్షుడు రాంచంద్రం పాల్గొన్నారు.

◆ పారిశుధ్య కార్మికులకు సత్కారం

జహీరాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలలో సేవలందించిన దుర్గాభవాని, లక్ష్మణ్‌లను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. గురువారం ఆదర్శనగర్ కాలనీలోని శాలువాతో సత్కరించి అభినందించారు.

◆ రూ.50 వేల ఆర్థిక సహాయం

తూప్రాన్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గౌడ సంఘం నాయకుడు రవీందర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం ఆ కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సతీష్‌చారి, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్)లో.. మగ్దూంపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన జక్కుల లాలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు ఎంపీపీ జయరాంరెడ్డి తెలిపారు. మృతి చెందిన లాలయ్య కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజనీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, మల్లేశం, గిరిధర్‌గౌడ్, రాజు తదితరులున్నారు.

◆ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మండల నాయకుడు పురం రవి అన్నారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్ళకల్ గ్రామానికి చెందిన కనిగిరి అనసూయ, మల్లమ్మ, జీడిపల్లికి చెందిన పెంటమ్మ, శిరిష సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయగా విడుదలైన మొత్తం రూ.1.15 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీశైలం, నాయకులు పురం సత్యనారాయణ పాల్గొన్నారు.